# డబుల్‌బెడ్రూం ఇళ్లలో నీటికొరత



సిద్ధాపురంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లు



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్

- తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు
- కనెక్షన్ ఇవ్వడానికి మిషన్ భగీరథ అధికారుల జాప్యం
- ప్రైవేట్‌గా నీటిని కొంటున్న స్థానికులు

**హసన్‌పర్తి :** డబుల్‌బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు సరే..అయితే అక్కడ నీటి వసతి కల్పించలేదు. ఆ కాలనీలో తాగునీటి కోసం పడరాని పాట్లుపడుతున్నారు. మూడు నెలలుగా ఆ కాలనీ ప్రజలు ప్రైవేట్‌గా నీరు కొంటున్నారు. మండలంలోని సిద్ధాపురంలో 52 డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించారు. మూడేళ్ల పాటు ఆ ఇళ్లు పంపిణీ చేయకుండానే అలాగే వదిలేశారు. ఆ ఇళ్లల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానిక సర్పంచ్ ఫిర్యాదు చేశారు. దీంతో ఏడాదిన్నర క్రితం ఇళ్లను పంపిణీ చేశారు.

**ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా**

ఇదిలా ఉండగా కాలనీలో నీటి సమస్య ఉందని స్థానికులు అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేశ్ దృష్టికి తీసుకెళ్లారు. శాశ్వత నీటి సమస్య పరిష్కారం చేపట్టాలని ఆదేశించడమే కాకుండా, తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని హుకుం జారీ చేశారు. 15 నెలల పాటు గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. డీజిల్ బిల్లులు విడుదల కాకపోవడంతో పంచాయతీ అధికారులు సరఫరా చేయడానికి చేతులెత్తేశారు.

**ప్రత్యేక నిధులతో పైపులైన్ ఏర్పాటు**

డబుల్‌బెడ్ బెడ్రూంలో తీవ్ర సమస్యపై స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి స్పందించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కలిసి సమస్యను వివరించారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ వెంటనే పైపులైన్ నిర్మాణానికి రూ.3.60 లక్షలు విడుదల చేశారు. ప్రస్తుతం పనులు కూడా పూర్తయ్యాయి.

**కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం**

పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ మిషన్ భగీరథ అధికారులు కనెక్షన్ ఇవ్వడానికి జాప్యం చేస్తున్నారని సర్పంచ్ ధనలక్ష్మి తెలిపారు. మిషన్ భగీరథ కార్యాలయానికి వెళ్లి అధికారులతో మాట్లాడినా స్పందన లేదన్నారు. చేసిన పనులకు ఇప్పటి వరకు కూడా బిల్లులు రాలేదన్నారు.

### నీళ్లు వస్తేనే డబ్బులు ఇస్తరట



కలెక్టర్ ఇచ్చిన నిధులతో కాలనీలో పైప్‌లైన్ ఏర్పాటు చేశాం. బిల్లులు ఇవ్వమంటే కాలనీలో నీళ్లు వస్తేనే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నీటి సమస్య నెలకొంది.

– ధనలక్ష్మి, సర్పంచ్

### కనీస సౌకర్యాలు లేవు



డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో కనీస సౌకర్యాలు లేవు. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారు.

– ముస్కు ఉమ

### నీళ్లు కొంటున్నాం



పదిహేనునెలల పాటు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. మూడు నెలలుగా ట్యాంకర్లు రావడం లేదు. దీంతో రోజుకు రూ.30 ఖర్చుచేసి నీళ్లు కొంటున్నాం.

– మోటం రాజమౌళి

## క్లుప్తంగా

### కాలభైరవాష్టమి పూజలు



**హన్మకొండ కల్చరల్ :** కాలభైరవాష్టమి, కార్తవీర్యార్జున జయంతిని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని శ్రీమాతా శివశక్తి ఆలయంలో కాలభైరవాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం దేవాలయ అర్చకులు వంగల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి, భైరవునికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, కార్తవీర్యార్జున నవగ్రహ రుద్రభైరవ శివకృత్యాప్రత్యంగిరాదేవి హోమాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ మహాపరమేశ్వరుని రుద్రరూపమే భైరవరూపమని అలాంటి భైరవున్ని పూజించడంతో నవగ్రహ దోషాలు పోవడమే కాక శత్రుపీడ నుంచి విముక్తి కలుగుతుందని అన్నారు. అనంతరం అన్నప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమంలో దేవాలయం కార్యకర్తలు అశోక్‌కుమార్ వలస, చీకటి రాజు, మర్కా సునీల్‌గౌడ్, గంధ్రాతి రాజు, పెందోట చక్రపాణి పర్యవేక్షించారు. నిఖిలేశ్వర దత్తపీఠ పరివారం తంగళ్ళపల్లి మధుకర్‌రావు, అబ్బోజు రాజాచారి, మందాటి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

### రతన్‌కుమార్‌కు డాక్టరేట్



**హసన్‌పర్తి:** మండలంలోని భీమారానికి చెందిన చెన్నూరి రతన్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఈ అవార్డును అందజేసింది. 'ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ రికమండేడ్ సిస్టం పెర్ఫార్మెన్స్ బై స్పామింగ్ డిటెక్షన్ ఇన్ ఆన్‌లైన్ ఒపీనియన్స్ యూజింగ్ మిషన్ లెర్నింగ్' అనే అంశంపై పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకురాలు ప్రొఫెసర్ రాధిక పర్యవేక్షణలో పరిశోధనలు చేశాడు. ప్రస్తుతం రతన్‌కుమార్ హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌లో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

### యువతకు ఉచిత శిక్షణ

**హసన్‌పర్తి :** గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ మేనేజర్ రవి తెలిపారు. హనుమకొండ, వరంగల్, జనగాం, భూపాల్‌పల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని నిరుద్యోగ యువత శిక్షణ పొందడానికి అర్హులన్నారు. పుట్టగొడుగుల పెంపకంపై పదిరోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి, తెల్లరేషన్‌కార్డులు ఉన్న వారు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తిగల యువత రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 10లోపు హసన్‌పర్తిలోని సంస్కృతి విహార్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈనెల 11 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని రవి తెలిపారు.

### ఐలయ్యకు సముచిత స్థానం కల్పించాలి

**హన్మకొండ అర్బన్ :** రాష్ట్రంలో కురుమ కులం పక్షాన తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పించాలని కుల సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పోతరాజు రమేష్ ఒక ప్రకటనలో కోరారు. గతంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కూడా కురుమలకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత అవకాశాలు కల్పించలేదని వివరించారు. ఇప్పుడు కాంగ్రెస్ కురుమలను గుర్తించడం సంతోషకరమన్నారు.

### రాజనర్సింహను కలిసిన జన్ను భాస్కర్

**వరంగల్:** కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మాజీ ఉప ముఖ్య మంత్రి దామోదర రాజానర్సింహను ఆయన జన్మదినం సందర్భంగా తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను భాస్కర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించినట్లు భాస్కర్ తెలిపాడు.

### రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఆర్బిట్ విద్యార్థులు



**హసన్‌పర్తి:** రాష్ట్రస్థాయి జూడో పోటీలకు మండలంలోని ఎల్లాపురం శివారులోని ఆర్బిట్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగిన జిలాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల పోటీల్లో పాఠశాలకు చెందిన ఎస్.సాత్విక్, అభిరామ్, పి.అక్షర, జి.నిఖిల్,బి, రవి తేజ, ఆత్రేయనిలు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్‌రెడ్డి తెలిపారు.

## ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

**విద్యారణ్యపురి:** హనుమకొండ జిల్లా కమలాపూర్ ప్రాథమిక పాఠశాలలో బండెల రమేశ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ గత నెల 28న అనారోగ్యంతో మృతి చెందాడు. రమేశ్ పీఆర్‌టీయూ టీఎస్ కమలాపూర్ మండలశాఖలో అసోసియేట్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. పీఆర్‌టీయూ టీఎస్ నూతనంగా ప్రవేశపెట్టిన క్రియాశీలక సభ్యుడిగా, సంక్షేమ సంస్థసభ్యుడి రమేష్ కొనసాగుతున్నాడు. మంగళవారం ఈ సంక్షేమ నిధి నుంచి పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరిలు రూ.2 లక్షల చెక్కును హనుమకొండలో రమేష్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ అసోసియేట్ ఉపాధ్యక్షుడు ఆర్.భాను ప్రసాద్‌రెడ్డి, కమలాపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, శీలం ప్రకాశ్‌బాబు, బాధ్యులు దయాకర్‌రెడ్డి, సదాశివరెడ్డి, కాజీపేట మండల అధ్యక్షుడు మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహం ధ్వంసం



**హసన్‌పర్తి:** మండలంలోని జయగిరిలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో ఓ యువకుడి జన్మదిన వేడుకలు రాత్రి జరిగాయి. వేడుకల్లో గ్రామానికి చెందిన పిట్టల అజయ్, చింత వెంకటేష్, గీకుడు శివాజీ, యాటకాల కుమార్ పాల్గొన్నట్లు స్థానికులు తెలిపారు. అయితే మద్యం మత్తులో ఆ యువకులు గాంధీ విగ్రహం పక్క నిలబడి సెల్ఫీ తీసుకున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఆ తర్వాత విగ్రహాన్ని ధ్వంసం చేసి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆ యువకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ రాణి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గోపీ తెలిపారు.

## మెట్టుగుట్టపై రుద్రాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో స్వయంభూ మెట్టురామలింగేశ్వరస్వామి

**మడికొండ:** కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మడికొండలోని మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో మహన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. కాజీపేట వాస్తవ్యులు శర్విరాల సోమేశ్వర్–స్వరూపరాణి దంపతులు సుమారు రూ.28 వేల విలువగల వెండి శఠగోపం, ప్లేటు సమర్పించారు. రామలయంలో సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేపట్టారు. సాయంకాలం సూర్యాస్తమయం అనంతరం స్వామివార్లకు ఆకాశదీపోత్సవం నిర్వహించారు. అనంతరం పలు సేవ కార్యక్రమాలు చేశారు. కార్యనిర్వహణాధికారి కే. శేషభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**8న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం**

ఈనెల 8న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి శేషుభారతి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### అయ్యప్ప ఆలయంలో కార్పొరేటర్ పూజలు

**కాశిబుగ్గ :** ఓ సిటీ రోడ్డులోని శ్రీ సీతారామాంజనేయసహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ మంగళవారం పూజలు చేశారు. అనంతరం అయన ఆలయంలో నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారుల అన్నదానంలో పాల్గొని వారికి అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంతాచారి, సామల సదానందం, మాలధారులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### ఆలయంలో దీపాలంకరణ పూజలు



**కాజీపేట:** నగరంలోని 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలో కొలువు దీరిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం కార్తీక మాసోత్సవ వేడుకలను పురస్కరించుకుని దీపాలంకరణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘు రామాచార్యులు ఆధ్వర్యంలో కాలనీ మహిళలు ఆలయం పరిసర ప్రాంతాల్లో భారీగా దీపాలను అలంకరించారు. తుపాన్ కారణంగా చిరుజల్లులు పడుతున్నప్పటికీ అర్చకులు ధ్వజస్తంభానికి దీపంతో పూజలు చేశారు.

### 8 నుంచి మెగా సారీస్ ప్రదర్శన

**హన్మకొండ కల్చరల్ :** కృష్ణ ఆర్టిషనల్ అటైర్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి మూడురోజుల పాటు మెగా సారీస్ ప్రదర్శన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హన్మకొండ నక్కలగుట్టలోని పెండెం ఇన్‌ఫ్రా కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. వెంకటగిరి, కోయంబత్తూర్, మంగళగారి, బనారస్, బెంగాలి కాటన్, లేహంగా, కోట, కంచి, గద్వాల్, నారాయణపేట, చైనా సిల్క్ హ్యాండ్లూమ్ వస్త్రాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. మొదటి సారిగా హనుమకొండలో భారీ ఎత్తున ప్రదర్శన నిర్వహిస్తున్నామని, సందర్శకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### ప్రజాభవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నాం

**హన్మకొండ:** ప్రగతి భవన్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రజా భవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నామని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రగతిభవన్ సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయిందని, దొరల గడీగా మారిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి



**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కేయూ విద్యార్థి, ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం కేయూలోని కామన్ మెస్‌లోనికి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నానని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

## ఎమ్మెల్యే నాయిని చిత్రపటానికి పాలాభిషేకం



**కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్‌వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల కార్తీక్ మాట్లాడుతూ రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపునకు సహకరించిన పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు , విద్యార్థులకు, నిరుద్యోగులకు పాదాభివందనాలు, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీమా వినయ్‌కుమార్, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పసునూరు అరుణ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ 52, 53వ డివిజన్ అధ్యక్షులు ఎండీ. షంషేర్ బేగ్, పాల్గొన్నారు.

**కేయూ వద్ద ఎన్‌ఎస్‌యూ సంబురాలు**





**కేయూ క్యాంపస్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన సందర్భంగా మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమానిటీస్ భవనం వద్ద ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, జాక్ బాధ్యులు డాక్టర్ గంధసిరి రవీందర్‌గౌడ్, డాక్టర్ లపాక సురేష్, డాక్టర్ చందర్‌రావు బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ ప్రేమ్‌సుందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యనందించడం అభినందనీయం

- ఇంటర్ విద్య డీఈఐఓ మాధవరావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాధవరావు

**రామన్నపేట :** ఏవీవీ విద్యాసంస్థ ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీ పడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం అభినందనీయమని ఇంటర్ విద్య డీఈఐఓ కె.మాధవరావు పేర్కొన్నారు. ఏవీవీ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యాసంస్థలో మంగళవారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఏవీవీ విద్యాసంస్థలో చదువుకోవడం అదృష్టమని పేర్కొన్నారు. విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉత్తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ చందా విజయ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నిత్యం శ్రమిస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్ కోసం అన్ని విధాలా సాయం చేయడానికి యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బరుపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలకు రెక్కలు

- కార్తీకమాసం, అయ్యప్పస్వాములు మాలలు ధరించడమే కారణం

**కాజీపేట :** కార్తీకమాసం ఆరంభం నుంచే కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ట్రైసిటీలోని వరంగల్ నగరంలో కూరగాయల మార్కెట్‌లో 15 రోజులుగా కొన్ని రకాల ధరలు రెట్టింపు అయ్యాయి. కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకు అదనపు భారం పడుతోంది. బహిరంగ మార్కెట్లో కిలోకు రూ.20 అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూరగాయల దిగుబడి బాగానే ఉన్నా కార్తీకమాసం కారణంగా వినియోగం పెరగడంతో ధరలు సైతం పెంచేశారు.

**లోకల్‌గానే పండిస్తున్నా..**

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్న టమాట మినహా అన్ని రకాల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. కార్తీక మాసంతో పాటు అయ్యప్ప స్వాములు మాలలు ధరించడంతో ఇంటిల్లిపాది కూరగాయలనే వినియోగిస్తున్నారు. పడి పూజలు నిర్వహిస్తుండటంతో కూరగాయల వాడకం నాలుగింతలు పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. నగరంలో ఒక రైతుబజారుతో పాటు 100కి పైగా లోకల్ మార్కెట్‌లు ఉన్నాయి. వీటిలో రోజుకు 100–150 క్వింటాళ్ల వరకు అవసరం అవుతాయి. వీటికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. మరో రెండు, మూడు వారాల్లోగా ధరలు తగ్గుతాయని చెబుతున్నారు.

## లారీ ఓనర్లను ప్రభుత్వమే కాపాడాలి



విజయోత్సవ సంబురాల్లో పాల్గొన్న ఎండీ గోరెబాయ్, లారీ ఓనర్లు

**ఖిలా వరంగల్ :** ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్న లారీ ఓనర్లను నూతనంగా ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వమే కాపాడాలని రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ సెక్రటరీ, ఓరుగల్లు లారీ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ. గోరేభాయ్ కోరారు. తూర్పు ఎమ్మెల్యేగా కొండా సురేఖ భారీ మెజార్టీతో గెలిచిన సందర్భంగా మంగళవారం వరంగల్–నర్సంపేట రోడ్డులోని లారీల పార్కింగ్ ప్రాంగణంలో లారీ ఓనర్లు స్వీట్లు పంపిణీ చేసి టపాసులు కాల్చి పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లారీ ఓనర్ల దీర్ఘకాలంగా ఎదుర్కొనే ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్లు చిట్టిమల్ల శ్రీనివాసరావు, వేముల శ్రీకాంత్, ఎండి యాకూబ్ షరీఫ్, సాంబారి సంపత్‌కుమార్, సమ్మయ్య, ఇస్మాయిల్, ఖాజాపాషా, మాషూక్, శ్రావణ్, ఫీటర్, శ్రీనివాస్, భిక్షపతి, ఇజాజ్, చోటేమియా, సాయికుమార్, బషీర్, అబిద్, అజ్జు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఇంద్రసేన ట్రస్ట్



బాలికకు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న ఇంద్రసేన ట్రస్ట్ చైర్మన్ ఉమేష్

**ఖిలా వరంగల్:** తండ్రి ఆశయ సాధనకు తనయుడు సామాజిక సేవలపై దృష్టి సారించాడు. తనకు ఉన్నంతలో పేదలకు ఆర్థిక సాయం చేయాలని సంకల్పించాడు. తండ్రి లేని పేదింటి ఆడపిల్లలకు రూ.10వేల ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టాడు. కార్మికనేత, ప్రముఖ న్యాయవాది, దివంగత ఇంద్రసేన 60వ జయంతి సందర్భంగా మంగళవారం తూర్పుకోటలో ఇంద్రసేన మెమోరియల్ ట్రస్టు చైర్మన్ సంగరబోయిన ఉమేష్ ఆధ్వర్యంలో పేదింటి అడపిల్లల చదువుల కోసం ఆర్థికసాయం అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల మృతిచెందిన సిరబోయిన శివ కుమార్తెకు సంగరబోయిన ఉమేష్ రూ.10వేలు పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను ఆ శాఖ అధికారి వెంకన్న అందజేసి సేవాదాతృత్వాన్ని చాటుకున్నాడు. ఇంద్రసేన ట్రస్ట్ ద్వారా విరివిగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంగరబోయిన చందర్, వాసు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు అయ్యప్ప పడిపూజ మహోత్సవం

**హన్మకొండ కల్చరల్ :** వరంగల్ భద్రకాళిరోడ్‌లోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప భక్తసేవాశ్రమంలో బుధవారం అయ్యప్ప జన్మనక్షత్ర అష్టాభిషేకం, మహాపడిపూజ మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు గణపతిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. పూజా మహోత్సవంలో ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, శ్రీశంకర గురుకుల వేదపాఠశాల అధ్యాపకులు, వేదపండితులు నారాయణ ఘనాపాటి, వేంకటేశ్వరశర్మలు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సేవాశ్రమం నిర్వాహకులు టీఆర్ బాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి గోపూజ, మహాసంకల్పం, కలశ స్థాపన, సహస్రమోదక మహాగణపతి హవనం, అయ్యప్పహవనం, మహాపూర్ణాహుతి, ప్రత్యేకపూజలు, అయ్యప్ప స్వామివారికి 18 రకాల అభిషేకాలు తదితర పూజాకార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రేవంత్‌రెడ్డికి అభినందనలు

**హన్మకొండ అర్బన్ :** తెలంగాణ నూతన సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్నట్లు తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ (టీపీఎస్‌ఎఫ్) రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆకారపు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 2018 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేసి, సర్వీస్ కూడా క్రమబద్ధీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా చనిపోయిన 40 మంది జూనియర్, అవుట్‌సోర్సింగ్ కార్యదర్శుల కుటుంబాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.